క్లుప్తంగా

వేతనాలు చెల్లించాలి

ఎల్లారెడ్డి: వేతనాలను వెంటనే చెల్లించాలని అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. రెండు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు నీలారాణి, దేవకర్ణ తదితరులు ఉన్నారు.

ఛత్రపతి శివాజీ వర్ధంతి



బాన్సువాడ: ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతిని సోమవారం బాన్సువాడలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాత బాన్సువాడలోని శివాజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు నవీన్, విజయ్, అరవింద్, సాయిబాబాగౌడ్ ఉన్నారు.

సభ్యత్వ కార్డుల పంపిణీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అఫీజ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఎల్‌వోసీ అందజేత



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మోడెగాం గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి సోమవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ రూ.లక్ష ఎల్‌వోసీని అందజేశారు. గ్రామంలోని దాసరి ప్రశాంత్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బాధితుడు నిరుపేద కావడంతో ఎల్‌వోసీ మంజూరు చేయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గొడెల్లి గంగాధర్, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు పతకం సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం జయశంకర్ కాలనీ, భవానీనగర్, ఆర్షగురుకులం, రైల్వే గేట్ ఏరియా ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు జయశంకర్‌కాలనీలోని ఓంకారేశ్వర ఆలయంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా చిట్టి మల్ల అనంతరాములు, ప్రధాన కార్యదర్శిగా రాజ భైరయ్య, కోశాధికారిగా లక్ష్మీపతిలు ఎన్నికయ్యారు.

పరీక్ష సమయంలో జిరాక్స్ కేంద్రాలను మూసేయాలి

భిక్కనూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో జిరాక్స్ కేంద్రాలను నెట్ సెంటర్లను కచ్చితంగా మూసి ఉంచాలని భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ కోరారు. ఆయన సోమవారం భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో మండల కేంద్రానికి చెందిన జిరాక్స్, నెట్ సెంటర్ల యజమానులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. నెట్ సెంటర్లను కూడా మూసి ఉంచాలని సూచించారు.

'జీపీగా ఏర్పాటు చేయాలి'

మాచారెడ్డి: మండలంలోని సోమారంపేట పరిధిలోని గిరిజన తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ తండా వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్, షేక్ అజీజ్, దేవయ్య, మోహన్ నాయక్, తండా వాసులు ఉన్నారు.

కార్మికుల సేవలు విలువైనవి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పారిశుద్ధ్య కార్మికుల సేవలు విలువైనవని, కార్మికులు ప్రతిరోజు గ్రామంలో పరిసరాలను శుభ్రం చేయడం వల్లనే పల్లెలు అందంగా ఉన్నాయని సర్పంచ్ కొడి రాధ అన్నారు. కన్‌కల్‌లో సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బందికి సన్మానం చేశారు. స్వయం మౌలిక వసతుల కల్పన- పేదరిక నిర్మూలన విభాగంలో ఆజాదీ కా అమృత్ మహోత్సంలో ప్రథమ బహుమతి కన్‌కల్ గ్రామానికి రావడం గొప్ప విషయమన్నారు.

బాన్సువాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.భూషణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పి.లక్ష్మీ నారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ ఖలీల్, కోశాధికారిగా పిట్ల మొగులయ్య ఎన్నికయ్యారు.

బిచ్కుందకు సెంట్రల్ లైటింగ్

- రూ.12 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరలోనే పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



బిచ్కుంద మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ కోసం ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరింది. ప్రభుత్వానికి, ఎమ్మెల్యే, ఎంపీలకు ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్నోసార్లు ఈ విషయం గురించి వినతి పత్రాలు అందించారు. ఎమ్మెల్యే హన్మంత్ సింధే కృషితో ప్రభుత్వం బిచ్కుంద మండల కేంద్రంలో యాభై ఫీట్ల మేర రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ కోసం జీవో విడుదల చేసి 2 కిలో మీటర్ల పనులకు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసింది. అధికారులు వెంటనే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కల నేటికి నెరవేరింది. జుక్కల్ నియోజక వర్గంలో మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం, బిచ్కుంద మండలాల మీదుగా ఎస్ఎస్‌ఏ నేషనల్ హైవే వెళ్తుంది. నియోజకవర్గంలో ఎక్కడ కూడా సెంట్రల్ లైటింగ్, యాభై ఫీట్ల వెడల్పు రోడ్డు లేదు. మొట్టమొదటి సారిగా బిచ్కుందకు మంజూరు కావడంతో అభివృద్ధి పథంలో బిచ్కుంద ముందుకు వెళ్తుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సర్వే చేసి మార్కింగ్ కూడా పూర్తి చేశారు. యాభై ఫీట్ల నుంచి కొంత తగ్గించాలని స్థలం కోల్పోతున్న కొందరు దుకాణదారులు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించారు. కందర్‌పల్లి నేషనల్ హైవేను బిచ్కుంద, బాన్సువాడ మీదుగా కామారెడ్డి హైవేను కలపడానికి యాభై ఫీట్ల రోడ్డు ఉండాల్సి ఉంటుందని అధికారులు సూచించారు. రెండు నేషనల్ హైవే కల్పడానికి ప్రతి పాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు ప్రజాప్రతినిధులు సూచించారు.

1.8 కిలోమీటర్లు..

అంబేద్కర్ చౌరస్తా సాదర్ చెరువు కల్వర్టు నుంచి బాలుర హాస్టల్ వరకు 1.8 కిలో మీటర్లు సెంట్రల్ లైటింగ్, రోడ్డు వేయనున్నారు. రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రైనేజీలు నిర్మిస్తామని, పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు. నివాసపు ఇళ్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం అందించి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాస్తామని ఎమ్మెల్యే హన్మంత్ సింధే హామీ ఇచ్చారు.

కల నెరవేరింది



ఎన్నో ఏళ్ల నుంచి ఎదరు చూస్తున్న సెంట్రల్ లైటింగ్ కల నెరవేరింది. లైటింగ్‌తో బిచ్కుంద అందంగా కనబడుతుంది. రాత్రి వేళల్లో ప్రమాదాలు కూడా జరగకుండా ఉంటాయి. – మసూద్ బిచ్కుంద

ట్రాఫిక్ సమస్య తీరుతుంది



రోడ్డు వెడల్పుతో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వ్యాపారస్తులు, ప్రజలు రాకపోకలు పెరుగుతాయి. అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తే వ్యాపారాలు పెరుగుతతాయి. – కర్క సాయిలు, బిచ్కుంద

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

దోమకొండ: చిరుధాన్యాలతో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాల లభిస్తాయని సమగ్ర శిశు అభివృద్ధి రాష్ట్ర స్థాయి ప్రతినిధులు రాకేష్, సురేష్, విజయలక్ష్మి, సుజాత అన్నారు. సోమవారం దోమకొండ మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చిరుధాన్యాలతో రకరకాల వంటలు చేసి వాటిని ప్రదర్శించారు. అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉన్న పిల్లలను ఎంపిక చేసి వారికి స్వచ్ఛ బాలక్ స్వర్థ సర్టిఫికేట్లు అందజేశారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సీడీపీవో రోశిష్మ, వైస్ ఎంపీపీ బాపురెడ్డి పాల్గొన్నారు.



దోమకొండలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రంలో పోషక పక్వాడ్‌పై అంగన్ వాడీ టీచర్లకు, ఐసీడీఎస్ సీడీపీవో సునంద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిరుధాన్యాల గురించి అవగాహన కల్పించారు.

ఏఈ పని తీరు బాగా లేదు

- రాజంపేట సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- బదిలీ చేయాలని తీర్మానం



మాట్లాడుతున్న ఎంపీపీ లింగాల స్వరూప

రాజంపేట: మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా కొనసాగింది. పశువైద్యాధికారి అనిల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రెండో విడత గొర్రెలను 80 శాతం సబ్సిడీపై పొందవచ్చని తెలిపారు. పంచాయతీ రాజ్ ఏఈ సోహైల్ మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు సీసీ రోడ్లకు రూ.85 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. శివాయిపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రధాన రోడ్డుకు దగ్గరగా చేపట్టాలని సభా దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ శాఖ ఏఈ మారుతి పని తీరు బాగా లేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆయన్ను వేరే మండలానికి బదిలీ చేయాలని కోరగా సభా అధ్యక్షులు తీర్మానం ద్వారా ప్రతిపాదించారు. బస్వన్నపల్లి, అర్గొండ గ్రామాలలో నీటి ఎద్దడి, ట్యాంకుల సమస్య ఉందని సంబంధిత మిషన్ భగీరథ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. వైస్ ఎంపీపీ సావిత్రి, జెడ్పీటీసీ కొండహన్మండ్లు, ఎంపీడీవో బాలకిషన్, తహసీల్దార్ జానకి పాల్గొన్నారు.

సాదాసీదాగా నస్రుల్లాబాద్ సమావేశం..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ పాల్త్య విఠల్ అధ్యక్షతన నిర్వహించిన సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. వివిధ శాఖల అధికారులు మూడు నెలలుగా చేసిన అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు. అనుకున్న సమయానికి అధికారులు రాకపోవడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ జన్నుబాయి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. భిక్కనూరు పీహెచ్‌సీ వైద్యురాలు యేమిమా ఆధ్వర్యంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

కామారెడ్డి రూరల్: రాఘవాపూర్‌లో సోమవారం జాతీయ ఉపాధి హామీ పనులను, ఈరియా కుంటలో పూడికతీత పనులను సర్పంచ్ సాగర్ గౌడ్ ప్రారంభించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి సుమేద, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామ్, ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.

మెల్లకుంటతండాలో హైమాస్ట్ లైట్ ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెల్లకుంటతండాలో హైమాస్ట్ లైట్‌ను సోమవారం జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. తండాపెద్దలు వసూరాం, దేవిసింగ్ పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణ పనుల పరిశీలన

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్, రాంపూర్, గౌరారం గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయ పనులను సోమవారం మండల పంచాయతీ అధికారి బ్రహ్మం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఆర్‌ఐ జానయ్య సోమవారం తెలిపారు. ఈనెల 30 లోపు పన్ను చెల్లించాలని లేకుంటే బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఇంటి పన్నులను ఈ నెల 30లోగా చెల్లిస్తే 5 శాతం డిస్కౌంట్ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సోమవారం తెలిపారు. అవకాశాన్ని అందరు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కోదూరి హనుమాన్ ఆలయం వద్ద బోరుబావి తవ్వకం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో గల పురాతన కోదూరి హనుమాన్ దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం నూతన బోరు మోటారు తవ్వకం పనులను ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాలరావు పూజ చేసి పనులను ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, కైలాస్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందులు పిచికారీ చేయాలి

నిజాంసాగర్(జుక్కల్): వరి పంట పొలాలపై ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు పురుగు మందులను తప్పనిసరిగా పిచికారీ చేయాలని ఏఈవో మధుసూదన్ సూచించారు. సోమవారం బూర్గుల్, నర్వ గ్రామాల్లో వరి పంట పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. తెగుళ్ల నివారణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నటనలో మొదటి స్థానం..ఎమ్మెల్యే సన్మానం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన విద్యార్థి గోనె కృష్ణ కుమార్‌ను సోమవారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే సన్మానించి అభినందించారు. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టూడియోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నటన పోటీలలో కృష్ణ కుమార్ ప్రథమ స్థానంలో అవార్డు తీసుకున్నారు. దీంతో కృష్ణ కుమార్‌ను అభినంది, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

సౌత్‌కొరియాలో ఉగాది సంబురాలు

భిక్కనూరు: దక్షిణ కొరియా దేశంలోని సియోల్ పట్టణంలో తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది సంబురాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భిక్కనూరు, కామారెడ్డి, ఎల్లారెడ్డి, ప్రాంతాలకు చెందిన తెలుగువారు పాల్గొన్నారు. ఉగాది పచ్చడి తయారు చేసి సౌత్ కొరియా ప్రజలకు కూడా పంపిణీ చేశారు. తదుపరి పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు.

లీకేజీల తెలంగాణగా మార్చారు

రామారెడ్డి: పరీక్ష పత్రాల లీకేజీ చేస్తూ లీకేజీల తెలంగాణగా మార్చడమే బంగారు తెలంగాణనా అని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓ ప్రకటన ద్వారా ప్రశ్నించారు. విద్యార్థులు రాసే ప్రతి పరీక్ష పేపర్లు లీక్ కావడం ప్రభుత్వ పనితనానికి నిదర్శనమని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం మంచిది కాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని హితవు పలికారు. అక్రమాలకు పాల్పడుతున్న బడా బాబులను బయటకు తేవాలని, పదవ తరగతి మొదటి తెలుగు పేపర్ లీక్ కావడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని మండిపడ్డారు.

ఢిల్లీలో జిల్లా నేతల నిరసన



కామారెడ్డి టౌన్: ఢిల్లీలో జంతర్ మంతర్ ధర్నా చౌక్ వద్ద సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ ధర్నాలో జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ఫిషర్మన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టినటు వారు తెలిపారు. రాహుల్ గాంధీపై లోక్‌సభ సభ్యత్వం తొలగించడం, జైలు శిక్షను విధించడం దారుణమన్నారు.

కంటివెలుగు శిబిరాలు ప్రారంభం

సదాశివనగర్(ఎల్లారెడ్డి):లింగంపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ గైని అనసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు ప్రారంభించారు. సర్పంచ్ గుండెల్లి సాయిలు, ఉప సర్పంచ్ దామోదర్ రావు, సీహెచ్‌వో నాగరాజు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): లక్ష్మాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ మాధవి ప్రారంభించారు. సర్పంచ్ రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సమాచారం..

▪ నేడు మండల సర్వసభ్య సమావేశం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజ్‌దాస్ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఘు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆయన చెప్పారు.

▪ 8న మహా గణపతి హోమం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి విద్యుత్‌నగర్ గౌరీ శంకర ఆలయంలో ఈనెల 8న శనివారం మహాగణపతి హోమం, అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రతినిధులు తెలిపారు. హోమంలో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా పది ప్రారంభం

అన్ని మండలాల పరిధిలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి నెలకొంది. ఉపాధ్యాయులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసి పరీక్షా కేంద్రంలోనికి పంపించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తగా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. రాజంపేట బాలుర పాఠశాలకు చెందిన కడమంచి పోచయ్య అనే విద్యార్థి పరీక్షా కేంద్రానికి అరగంట ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించ లేదు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌లకు పాల్పడకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు. –సాక్షి నెట్‌వర్క్



అచ్చంపేట మోడల్ పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



నాగిరెడ్డిపేట: పరీక్షా కేంద్రానికి తరలివస్తూ..



పిట్లంలో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

తైబజార్ వేలం జరిగేనా ?

- నేడు మూడో సారి తైబజార్‌కు వేలం

బాన్సువాడ: బాన్సువాడ తైబజార్‌కు మంగళవారం వేలం పాట జరుగుతుందో లేదోనన్న సందేహాలు కలుగుతున్నాయి. గత నెల 21న మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జంగం గంగాధర్ అధ్యక్షతన తైబజార్‌కు వేలం నిర్వహించారు. రోజువారి సంత, వారంతపు సంత, మేకల సంతకు వేలం నిర్వహించారు. అయితే రోజువారి సంత, వారంతపు సంతను కాంట్రాక్టర్లు వేలం పాట పాడి దక్కించుకున్నారు. కానీ మేకల సంతను గత ఏడాది రూ.45 లక్షలకు వేలం పాటలో ఎల్లారెడ్డికి చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. అయితే ఈ ఏడాది 2023–24 ఆర్థిక సంవత్సరానికి గత నెల 21న మేకల సంతకు వేలం వేయగా ముగ్గురు కాంట్రాక్టర్లు డీడీలు చెల్లించి వేలం పాటలో పాల్గొనలేదు. దీంతో మేకల సంతను గత నెల 28కి వాయిదా వేశారు. మళ్లీ మేకల సంతకు వేలం వేయగా డీడీలు చెల్లించి కాంట్రాక్టర్ల వేలం పాట పాడేందుకు వెనుకడుగు వేశారు. ఏడాదిలో రూ.45 లక్షలు వసూలవుతాయా లేదా అనే సందేహంలో ఉన్నారు. దీంతో మళ్లీ మున్సిపల్ అధికారులు మేకల సంతను ఈ నెల 4న వేలం పాట నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మున్సిపల్ చట్టం ప్రకారం గత ఏడాది వేలం పాటలో పాడిన దాని కంటే 5 శాతం ఎక్కువ వేలం వేసి కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంటుంది.

సీఆర్‌టీగా నియమించేలా చర్యలు తీసుకోండి

బాన్సువాడ: బాన్సువాడలో సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని విద్యావాలంటీర్లు కలిసి సమస్యలను విన్నవించారు. ఆశ్రమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న విద్యావాలంటీర్లకు రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, వేతనం కూడా ఆరు నెలలుగా రావడం లేదని వాపోయారు. వీవీలుగా పని చేస్తున్న వారందరికి సీఆర్‌టీ(కాంటాక్ట్ రెసిడెన్సీయల్ టీచర్స్)గా నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన స్పీకర్, మంత్రి సత్యవతి రాథోడ్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. వీవీల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు



స్పీకర్‌కు సమస్యలను వివరిస్తున్న వీవీలు

కొమురయ్య జీవితం ఆదర్శం



జిల్లా పోలీస్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



జిల్లా కేంద్రంలో .. బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కొమురయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని కురుమలు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్యని కొనియాడారు. దొరల ఆగడాలపై పోరాడిన మహా వీరుడి బాటలో ప్రతి ఒక్కరూ నడువాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



బాన్సువాడలో ..కురుమ సంఘం నేతలు



గోపాల్‌పేటలో .. ఎంపీపీ , జెడ్పీటీసీ

దసరా సినిమా పోస్టర్ల దహనం





బాన్సువాడలో దసరా సినిమా పోస్టర్లను దహనం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు.. దోమకొండలో..

బాన్సువాడ టౌన్/దోమకొండ:అంగన్‌వాడీ టీచర్లను కించపరిచేలా దసరా సినిమాలో ఉన్న సన్నివేశాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాన్సువాడ, దోమకొండ ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన చేశారు. దసరా సినిమా పోస్టర్లను దహనం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా నటించిన వెన్నెల పాత్ర అంగన్‌వాడీ టీచరుగా చూపించారని, చిరుద్యోగిని దొంగగా చిత్రీకరించిన డైరెక్టర్‌పై చర్యలు తీసుకుని సినిమాలో సన్నివేశాలను తొలగించాలన్నారు. లేకుండా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆత్మీయ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్‌లో ఈ నెల 5న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ కోరా రు. సోమవారం మహమ్మద్‌నగర్‌లో ఆయన మా ట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పార్టీ ఆధిష్టానం ఆత్మీయ సమ్మేళన సభలు ని ర్వహిస్తుందన్నారు. సమ్మేళనానికి జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ఆయన చెప్పారు. సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, తదితరులున్నారు.